# విపక్షాల దిమ్మ తిరిగేలా మ్యానిఫెస్టో

- విపక్షాలకు విలువ లేదు కేసీఆర్‌కు తిరుగులేదు
- రైతులకు సీఎం కేసీఆరే చాంపియన్
- తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌కేజీ కంటే తక్కువ ఫీజుతోనే ఎంబీబీఎస్ చదువు
- మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి మహేశ్వరం మెడికల్ కాలేజీకి హరీశ్‌రావు శంకుస్థాపన



రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

రంగారెడ్డి/నాగర్‌కర్నూల్ అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రతిపక్షాల దిమ్మతిరిగేలా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ఉంటుందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక మహిళలు, వితంతువులు, వృద్ధులు, యువత, రైతులకు ఏమి చేయాలో మ్యానిఫెస్టోలో ఉంటుందని వివరించారు. రాష్ట్రంలో విపక్షాల మాటకు విలువ లేదని, కేసీఆర్ పాలనకు తిరుగులేదని చెప్పారు. రైతులకు సీఎం కేసీఆరే చాంపియన్ అని పేర్కొన్నారు. ఆదివారం ఆయన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మీర్‌ఖాన్‌పేట్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రూ.176 కోట్లతో మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేశామని, మరో రూ.300 కోట్లతో 450 పడకల దవాఖానను నిర్మిస్తామని చెప్పారు. ఏడాదిలోగా మెడికల్ కాలేజీని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. పట్టుబట్టి మెడికల్ కాలేజీని సాధించిన ఘనత సబితక్కకే దక్కుతుందని కొనియాడారు. అరవై ఏండ్ల పాలనలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణలో రెండు మెడికల్ కాలేజీలను మాత్రమే అది కూడా గులాబీ జెండా పుట్టినంకనే ఏర్పాటుచేశారని చెప్పారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలోనే 29 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని వివరించారు. ఆ రోజుల్లో ఎంబీబీఎస్ చదివేందుకు రష్యా, ఉక్రెయిన్, చైనా, ఫిలిప్పీన్ వంటి దేశాలకు వెళ్లాల్సి వచ్చేదని చెప్పారు. అప్పట్లో సబితక్కకు 1200 ర్యాంకు వచ్చినా మెడికల్ సీటు రాలేదని, ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా మనుషుల డాక్టర్ కావాలనుకుంటే సీటు రాక పశువుల డాక్టర్ అయ్యారని ఉదహరించారు. ఈ తొమ్మిదేండ్లలో రాష్ట్రంలో 10 వేల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని, లక్షా యాభై వేల ర్యాంకు వచ్చినా సీట్లు దొరుకుతున్నాయని తెలిపారు. ఏడాదికి రూ.10 వేల ఫీజుతోనే ఎంబీబీఎస్ చదువుకొనే అవకాశం లభించిందని, ఎల్‌కేజీ కంటే తక్కువ ఫీజుతోనే వైద్య విద్యను సీఎం కేసీఆర్ అందుబాటులోకి తెచ్చారని వివరించారు.

### అభివృద్ధికి కేరాఫ్‌గా తెలంగాణ

ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో నల్లా లేని ఇల్లు, ట్రాక్టర్, పల్లెప్రకృతి వనం లేని ఊరు, డాక్టర్ లేని పీహెచ్‌సీ, పునరుద్ధరణ చేయని చెరువు లేదని చెప్పారు. రైతుబంధు అందని రైతు, ఆసరా పెన్షన్ అందని అవ్వా, తాత, కల్యాణ లక్ష్మి అందుకోని అక్కాచెల్లెళ్లు కూడా లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రజిని, బీఆర్‌ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించిన బహిరంగసభకు హాజరైన ప్రజలు


### త్వరలోనే పాలమూరు ఎత్తిపోతల నీళ్లు

తెలంగాణకు ఏర్పడిన తరువాత రంగారెడ్డి జిల్లాలో భూములకు విలువ పెరిగిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాంతానికి పరిశ్రమలు పెద్ద ఎత్తున తరలివస్తున్నాయని, దాదాపు 50 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించేలా ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని, పరిశ్రమలను అభివృద్ధి చేస్తూనే సంక్షేమ పథకాలు అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నీటిని మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం ప్రాంతాలకు పారించి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటామని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్న సబితక్క ఈసారి లక్ష పైచిలుకు మెజార్టీతో గెలవడం ఖాయమని పేర్కొన్నారు.

# రంగనాయకసాగర్ అద్భుతం

- ప్రకాశం బ్యారేజ్‌ను చూసినట్టే ఉన్నది
- ప్రముఖ ప్రవచనకర్త చాగంటి ప్రశంస

చిన్నకోడూరు, అక్టోబర్ 1: ఎక్కడో దూరంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను ఇంత ఎత్తుపైకి తీసుకువచ్చి సిద్దిపేటలోని రంగనాయకసాగర్‌ను నింపడం మామూలు విషయం కాదని, ఇదో అద్భుతమని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు కొనియాడారు. ఆదివారం ఆయన సతీమణితో కలిసి రంగనాయకసాగర్ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఏఈ ఖాజా కాళేశ్వరం ప్రాజెక్టు విశేషాలను వారికి వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ స్వరూపం, కాళేశ్వరం నీళ్లు తీసుకొని ఎక్కడెక్కడికి పంపిస్తున్నారనే విషయాన్ని మ్యాపు సహాయంతో క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. తాను ఇక్కడి వాతావరణం చూ స్తుంటే ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉన్న అనుభూతి కలుగుతున్నదని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు కృషిని ప్రశంసించారు. కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధ్యమని కాళేశ్వరం ప్రాజెక్టును చూస్తే అర్థమవుతుందని, ఈ విషయాన్ని తన ప్రవచనాల్లో ప్రస్తావిస్తానని పేర్కొన్నారు.



రంగనాయకసాగర్ పంప్‌హౌస్‌ను సతీమణితో కలిసి సందర్శించిన ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు

## 19,020 డబుల్ ఇండ్ల పంపిణీ నేడు

మొదటిపేజీ తరువాయి...

ఈ నెల 5న మరో 17,864 డిగ్నిటీ హోమ్స్‌ను లబ్ధిదారులకు అప్పగించనున్నది. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాగా, ర్యాండమైజేషన్ విధానంలో ఫ్లాట్లను కేటాయించనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా కుత్బుల్లాపూర్, చేవెళ్ల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, పటాన్‌చెరు, మేడ్చల్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో ఇండ్ల పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. మంత్రులు హరీశ్‌రావు, తలసాని, మహమూద్ ఆలీ, పట్నం మహేందర్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మల్లారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేదలకు ఇండ్ల పట్టాలను అందించనున్నారు. ఇక నగరంలో ఇప్పటివరకు తొలివిడతలో 11,700 మందికి, రెండో విడతలో 13,200 మందికి ఇండ్లను విజయవంతంగా పంపిణీ చేశారు.

## అంగన్‌వాడీలకు పీఆర్సీ

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం ఇవ్వనున్న పీఆర్సీలో అంగన్‌వాడీలను చేర్చుతామని, ప్రభుత్వ ఉద్యోగులతోపాటు వారి జీతాలను కూడా పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద పెండింగ్‌లో ఉన్న బిల్లులను సైతం ప్రభుత్వం విడుదల చేసిందని, ఒకటి రెండు రోజుల్లో వారి ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ఇతర డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మిగిలిన అంశాలపై నివేదికను సమర్పించాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి భారతి హోలికేరిని మంత్రులు ఆదేశించారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో రాష్ట్రంలోని 70 వేల మంది అంగన్‌వాడీలకు లబ్ధి చేకూరుతుందని హరీశ్‌రావు వివరించారు.

### సీఎం కేసీఆర్‌కు అంగన్‌వాడీల కృతజ్ఞతలు

సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడంతో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా అంగన్‌వాడీల గురించి పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అంగన్‌వాడీల సంక్షేమంపై చిత్తశుద్ధితో ఉన్న సీఎం కేసీఆరేనని కొనియాడారు. డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులతో జరిగిన చర్చలు ఫలవంతమయ్యాయని, సమ్మెను విరమించుకుంటున్నట్టు ప్రకటించారు. సీఎంపై తమకు విశ్వాసం ఉన్నదని చెప్పారు.

# బీజేపీ ఎన్నికల ప్రలోభాలు షురూ

- గొడుగులు, చీరలు, జ్యూట్‌బ్యాగులపై ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫొటోలు
- దుబ్బాకలో బీజేపీ శ్రేణుల పంపిణీ
- సోషల్‌మీడియాలో పంపిణీ దృశ్యాలు వైరల్

దుబ్బాక టౌన్, అక్టోబర్ 1: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో బీజేపీ దొడ్డి దారిన గెలువాలని ఎన్నికలకు ముందే ప్రజలను ప్రలోభాలకు గురిచేయడం ప్రారంభించింది. ఈ విషయమై కొన్ని దృశ్యాలు ఆదివారం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేశాయి. ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫొటోలు ఉన్న గొడుగులు, చీరలు, జ్యూట్‌బ్యాగులను బీజేపీ శ్రేణులు బహిరంగంగా గ్రామాల్లోకి ఆటోలో తీసుకొచ్చి పంపిణీ చేశాయి. బీజేపీ శ్రేణులు అందిస్తున్న జ్యూట్ బ్యాగుల్లో చీరలు, గొడుగులు ఉన్నాయా? మరేమైనా డబ్బులు ఉన్నాయా? అంటూ కామెంట్స్ వస్తున్నాయని, వీటిపై ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమాధానం చెప్పాలని బీఆర్‌ఎస్ శ్రేణులు సోషల్‌మీడియా వేదికగా డిమాండ్ చేశాయి. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోక.. ఎన్నికల్లో గెలిచే అవకాశం లేదని గ్రహించి ఎమ్మెల్యే ఎన్నికల ప్రలోభాలకు తెరలేపారని విమర్శిస్తున్నాయి. ఈ విషయమై ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ శ్రేణులు కోరుతున్నాయి.



సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫొటోలతో పంచుతున్న చీరల కిట్లు